క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు



హన్మకొండ అర్బన్: శ్రావణమాసం మొదటి శుక్రవారం, నాగుల పంచమి సందర్భంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవి.. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిచ్చినట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం మల్లెలు, చామంతులు, గులాబీలు, తీరొక్క పూలతో అమ్మవారిని అలంకరించినట్లు వివరించారు.

బెల్టులు, ఐడీ కార్డుల పంపిణీ



రామన్నపేట: నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలోని విద్యార్థులకు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి రూ.20 వేల విలువైన బెల్టులు, ఐడీ కార్డులను విరాళంగా అందజేశారు. వాటిని విద్యార్థులకు మట్టెవాడ ఎస్సై విఠల్ శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే, చమక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

సామాజిక సమస్యలపై అధ్యయనం చేయాలి




కేయూ క్యాంపస్: పరిశోధకులు సామాజిక సమస్యలపై అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వి.శోభ సూచించారు. యూనివర్సిటీలోని ఆ విభాగం పరిశోధకులతో శుక్రవారం నిర్వహించిన విస్తృతోపన్యాసంలో ఆమె మాట్లాడారు. పరిశోధనలో శాంపిల్స్ టెక్నిక్స్, పరిశోధన ప్రాథమిక ఉద్దేశాలను వివరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ తోట సత్యనారాయణ మాట్లాడుతూ శాస్త్రీయ సామాజిక యధార్థ విలువలతో కూడిన పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. సమావేశంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్ రావు, పరిశోధకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



హన్మకొండ చౌరస్తా: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్.. జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువత రాజకీయాల్లో రాణించాలన్న ఉద్దేశంతోనే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ.. అఖిల భారత యువజన కాంగ్రెస్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, యువజన నాయకులు సాయిరాజ్, సాంబరాజ్, సాయి, మనోజ్, సంజయ్, వంశీయాదవ్, అలెగ్జాండర్, రాకేష్, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమానికి వ్యాన్ బహూకరణ



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కేయూ – పెద్దమ్మగడ్డ బైపాస్ రోడ్డులోని రెడ్డి కాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమానికి ఎల్ఐసీ (గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్) వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో టాటా వింగర్ వ్యాన్‌ను శుక్రవారం బహూకరించారు. ముఖ్యఅతిథిగా ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ హాజరై వ్యాన్ తాళం చెవిని అతిథి ఆశ్రమ అధ్యక్షురాలు సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఉత్తప్ జోసెఫ్, సీనియర్ డీఎం సుబ్రహ్మణ్యన్, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ బిస్వరాజ్, ఎల్ఐసీ ఉద్యోగులు, అతిథి ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కాసు శిల్ప



కాసు శిల్ప

వరంగల్: బీజేపీ వరంగల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కాసు శిల్ప, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పోలెపాక మార్టిన్ లూథర్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సర్దార్ గోవింద్ సింగ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బైరి నాగరాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బానోతు వీరన్న నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేయిస్తంభాల దేవాలయంలో అభిషేకం



మెట్టుగుట్టపై పూజలు చేస్తున్న భక్తులు



కాజీపేటలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



ఘనంగా నాగుల పంచమి వేడుకలు

నగర వ్యాప్తంగా నాగు పంచమి వేడుకలు, వరలక్ష్మి వ్రతాలను ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుట్టల్లో పాలు పోశారు. వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఓసిటీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..



వరంగల్ నాగేశ్వరస్వామి దేవాలయంలో..



హసన్‌పర్తి: పూజలు చేస్తున్న మహిళలు



కాశిబుగ్గ కనకదుర్గామాత దేవాలయంలో..



శివనగర్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడిలో..

చరక మహర్షి జయంతి వేడుకలు

కాశిబుగ్గ: వరంగల్ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, బోధన వైద్యశాలలో చరక మహర్షి జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని చరక మహర్షి విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో చరక శపథం చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్.శ్రీధర్, డాక్టర్ సిరాజుద్దీన్, కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాల్నె సాంబమూర్తి, వైద్యులు జగన్మోహనచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మహేష్, సిబ్బంది, వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అధ్యాపకులు, వైద్య విద్యార్థులు

‘స్వచ్ఛదనం - పచ్చదనం’

నగర వ్యాప్తంగా స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి డివిజన్లలో పలు మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నయీంనగర్: మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిస కావొద్దని హనుమకొండ ఎక్సైజ్ సీఐ జి.దుర్గాభవాని సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హనుమకొండ ఆధ్వర్యంలో కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై శుక్రవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ దామోదర్, హనుమకొండ పోలీస్ సీఐ వై.సతీష్, డాక్టర్ ప్రహషిత్, ఏడీ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత అడ్డదారులు తొక్కుతుండడం బాధాకరమని ఎస్సై లవన్ కుమార్ అన్నారు. కాజీపేట పట్టణంలో డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని కాపాడుదాం అనే అంశంపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై శ్యాంసుందర్, వెలుగు ఏజీఎం శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిరంజీవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరుకున్న పాలిటెక్నిక్ కళాశాల భవనం

హన్మకొండ అర్బన్: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ కళాశాల విద్యార్థులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్, వెంకటేష్, కళాశాల విద్యార్థులు అయాన్, ఆదిత్య, ఎబెనెజర్, దినేష్, వసంత, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

అవయవ దానానికి ముందుకు రావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కేయూ క్యాంపస్: అవయవ దానం అత్యున్నతమైనదని, ఈక్రమంలో ప్రతిఒక్కరు ముందుకు రావాలని అవయవ దాతల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పరికిపండ్ల అశోక్ కోరారు. ప్రపంచ అవయవదాన వారోత్సవాలను పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో వాకర్స్‌తో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నేత్రదానంతో అంధుల్లో వెలుగులు నింపవచ్చని, అవయవ దానంతో ఆరిపోయే ప్రాణాలను నిలబెట్టవచ్చని, భావితరాల వైద్యులు పరిశోధనలకు శరీర దానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రముఖ పర్యావరణవేత్త రతన్‌సింగ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, దామోదర్, అర్జున్, వెంకటరెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.


బీసీల సత్యాగ్రహ దీక్షకు తరలిరండి

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 10న నిర్వహించనున్న బీసీల సత్యాగ్రహ దీక్షకు బీసీ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు అశోక్ యాదవ్, చెన్నం మధు, నాయకులు రజినీకాంత్, క్రాంతికుమార్, వెంకన్న, జనార్దన్ గౌడ్, శరత్‌చంద్ర, వీరస్వామి, రాకేష్ యాదవ్, పబ్బోజు శ్రీకాంతాచారి, సతీష్, రాకేష్, నరేందర్, వినోద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

దోపిడీదారులు దేశం వదిలి వెళ్లిపోవాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వరంగల్: దేశంలోని బడా కార్పొరేట్ దోపిడీదారులు దేశం వదిలి వెళ్లిపోవాలని రైతు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ‘క్విట్ ఇండియా డే’ సందర్భంగా వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో రైతు, కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. కార్మిక సంఘ నాయకుడు గంగుల దయాకర్ అధ్యక్షత వహించిన సమావేశంలో రైతు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2018వ సంవత్సరం నుంచి రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, ఫలితంగా రైతులు హక్కులు, ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రమేష్, శ్రీనివాస్, బాలరాజు, రమేష్, రామస్వామి, ప్రతాప్, కుమారస్వామి, సాగర్, కృష్ణ, బాబురావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

వరంగల్: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల కళాశాల సెక్రటరీ ఆదేశాలు పాటించని రీజినల్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కడపాక రాజేందర్, బొట్ల నరేష్, అజయ్ డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో డెమోలు నిర్వహించకుండా చేపట్టిన గెస్ట్ ఉపాధ్యాయుల నియామకాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకుల పాఠశాల్లో పనిచేస్తున్న 300 మందిని తొలగించగా, కొన్నిచోట్ల సెక్రటరీ ఆదేశాలు పాటించకుండా నియమించిన సంఘటనలు నెలకొన్నాయన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయపై గురుకుల పాఠశాల కార్యదర్శి సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతిరెడ్డికి సమాచారం చేరవేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

నయీంనగర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, మత స్వేచ్ఛను అందించాలని నేషనల్ దళిత్ క్రిష్టియన్ వాచ్ తెలంగాణ కమిటీ సెక్రటరీ సిస్టర్ మంజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మంజు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా, దేశ పౌరుల మత స్వేచ్ఛకు విరుద్ధంగా రాష్ట్రపతి ఉత్తర్వులు అమలులోకి వచ్చిన సందర్భంగా ప్రతిఏడాది ఆగస్టు 10న దళిత క్రైస్తవులు నిరసన దినంగా పాటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రభాకర్, జన్ను సంతోష్, దినకర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్లకు శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు చేపట్టిన జె.రామనర్సింగరావు, డి.ఆనంద్‌ను హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ బాధ్యులు శుక్రవారం సన్మానించారు. అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, ఎర్ర ప్రగడ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏఓ రవీందర్‌కు సన్మానం

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్ ఎల్.రవీందర్‌ను ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సన్మానించారు. రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో యూనియన్ రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సజ్జన్ నాయక్, బీఎస్.చారి, ఎల్లయ్య, రవీందర్, రాజు, గౌస్‌పాషా, వి.శ్రీనివాస్, భిక్షపతి, పులి సదానందం శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ రోడ్డులో మైసమ్మతల్లి, పోతలింగన్న స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వొలిశెట్టి అనిల్, కొమ్మిని రాజేందర్, గోనె ప్రసాద్, పగడాల సంపత్, రవి, వొగిలిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో వేద పండితుడు శర్మ నేతృత్వంలో హోమం, గణపతి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానికులు హాజరై సామూహికంగా హోమం చేశారు. సాయంత్రం 6గంటలకు దేవతా విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు.

పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించాలి

విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, సభ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధ్యులు రాజిరెడ్డి, సాయి కోట్లర్, యశ్వంత్, నరేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హనుమకొండ గోపాలపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తీరాల యుగంధర్ కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు మార్త రవీందర్‌గౌడ్, మలహర్‌రావు, రాజమౌళి, వెంకటేశ్వర్లు, రాజేందర్ పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమంలో జన్మదిన వేడుకలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కేయూ – పెద్దమ్మగడ్డ బైపాస్‌రోడ్డులోని రెడ్డికాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలు బొజ్జ భాను ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కేక్ కట్ చేయించి వారికి పండ్లు, గుడ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వేడుకల్లో మహేష్‌బాబు యువసేన జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవర సమ్మయ్య, కోర శ్రీను, మంద రామకృష్ణ, అంబటి రాజు, మస్కు సదానందం, లింగన్న, గడ్డం నాగరాజు, బత్తిని ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రనాయక్ తండాలో తీజ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం హరిశ్చంద్రనాయక్ తండాలో తీజ్ ఉత్సవాలను గురువారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్ మదన్, మాజీ ఉపసర్పంచ్ రాజు, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

న్యూశాయంపేట: మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం (ఎంఐఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో సాయంత్రం జరగనున్న సమ్మేళనంలో ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని తమ కవితలను వినిపిస్తారని పేర్కొన్నారు. అలాగే, మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హన్మకొండ చౌరస్తా: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పచ్చదనం – ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు అనే అంశంపై హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈమేరకు ఉత్తమ వ్యాసరచన బహుమతిని 8వ తరగతి విద్యార్థి సీహెచ్.విశ్వ అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది భాస్కర్, మోహన్, స్కూల్ కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ముదిరి నాగరాజు, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27న వాగ్దేవి కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

హన్మకొండ: వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీని స్థాపించి 25ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ రెడ్డి తెలిపారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో ది విక్టరీ ఆఫ్ ఫిజియోకాన్ – 2024 అంతర్జాతీయ సదస్సు వాల్‌పోస్టర్లను కళాశాల డైరెక్టర్ వాహిణిదేవి, ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి, అధ్యాపకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్ రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 27న హనుమకొండ గోకుల్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, అధ్యాపకులు నిధి ఖారే, చల్ల శ్రీనివాస్ రెడ్డి, కర్క శ్రీనివాస్ రెడ్డి, శరవణ భవ, హిమబిందు, కొమురారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ రెగ్యులర్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లకావత్ బాలాజీనాయక్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్‌రావు కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

వరంగల్: బల్దియా అదనపు కమిషనర్‌గా రాజేందర్ రెడ్డి, డీసీపీగా రవీందర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా హేమభాను, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా ప్రతిభ బాధ్యతల స్వీకరించారు. అనంతరం వారు మేయర్ సుధారాణికి కలిశారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

కాజీపేట: ఇద్దరు యువకులు మద్యం మత్తులో చిల్లర డబ్బుల కోసం కాజీపేట ప్రధాన రహదారిపై శుక్రవారం ఘర్షణ పడ్డారు. రోడ్డుపై చెత్తను కుప్పగాపోసి వారు తగాదా పడుతూ కొట్టుకోవడం చూపరులను ఆశ్చర్యపరిచింది. పోలీసులు జోక్యం చేసుకుని బెదిరించడంతో ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. కాగా, ఆ యువకులు గంజాయి సేవించి ఉంటారని స్థానికులు వ్యాఖ్యానించారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

హన్మకొండ / హన్మకొండ అర్బన్: ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు సఖి సేవలను వినియోగించుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ ఎ.శ్రీదేవి సూచించారు. హనుమకొండ సుబేదారిలోని వీఎంసీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సఖి సెంటర్ ద్వారా బాధిత మహిళలకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు, దాడులకు గురైన మహిళలు, బాలికలకు సఖి సెంటర్ రక్షణ కల్పిస్తోందని వివరించారు. బాధితులు 181, 0870 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కేసు వర్కర్ హరిత, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: ఆపదలోని మహిళలు, బాలికలకు అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్ నిలుస్తోందని సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల తెలిపారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సఖి సేవలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాధిత మహిళలు సఖి సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ సరోజ, ఉపాధ్యాయులు సరళ, సౌందర్య, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల హక్కు పత్రాల కోసం పోరాటం

వరంగల్: జల్, జంగిల్, జమీన్‌ను రక్షించుకోవడానికి నిర్మాణాత్మక ఉద్యమాలు చేపట్టి, గిరిజనులకు హక్కులు, పోడు భూములపై హక్కు పత్రాల కోసం పోరాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. నాయకుడు సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవడం అంటే భూమి, ప్రకృతి, గాలి, నీటిని పరిరక్షించుకోవడమే అని నేటి సమాజం గుర్తించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు వస్కుల మట్టయ్య, జి.కుమారస్వామి, పి.రమేష్, ఎన్.ప్రతాప్, కె.బాబురావు, కొమురయ్య, ఇస్మాయిల్, రాజాసాహెబ్, మల్లికార్జున్, నాగేష్, సదానందం, రమేష్, రాజు, ప్రభాకర్, బి.కుమారస్వామి, వెంకటయ్య, సాంబయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, తదితరులు

విద్యారణ్యపురి: చదువును మధ్యలో నిలిపివేసిన వారు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో చేరాలని హనుమకొండ జిల్లా డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై కోరారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లు, ప్రాస్పెక్టస్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని వివరించారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పీజీ హెచ్ఎం రాధ, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శైలజ, శారద, సీనియర్ అసిస్టెంట్ అశోక్, అవినాష్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

12న మజ్దూర్ యూనియన్ ధర్నా

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం భోజన సమయంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ అలవెన్స్‌లు, డీఏలు, 8వ పే కమిషన్ ఏర్పాటు, కొత్త పింఛన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని కోరుతూ కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే డిపోల్లో చేపట్టనున్న ధర్నాను రైల్వే కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.